ప్రజాశక్తి

శుక్రవారం 30 మే 2025

5

కర్నూలు



మహానందరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ప్రభాకర్ రెడ్డి, గౌస్ దేశాయ్

సాంకేతిక కష్టాలు

- నిలిచిన పదోన్నతుల కౌన్సెలింగ్
- సాయంత్రం నుంచి మాన్యువల్ పద్ధతిలో
- నిరసన తెలిపిన ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియకు సాంకేతిక కష్టాలతో నిలిచిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్ పనిచేయకపోవడంతో కౌన్సిలింగ్ హాజరైన ఉపాధ్యాయులు విసుగెత్తిపోయారు. విద్యాశాఖ అధికారుల చర్యల పట్ల ఉపాధ్యాయ సంఘాలు నిరసన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో ఉపాధ్యాయులకు పదోన్నతుల కౌన్సిలింగ్ ప్రక్రియను కర్నూలు నగర శివారులలోని సెయింట్ ఖ్రాలెక్స్‌స్కూల్లో నిర్వహించారు. గురువారం గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కర్నూలు జిల్లాలో దాదాపుగా 132 స్థానాల్లో గ్రేడ్ 2 హెచ్ఎం పోస్టులు ఖాళీలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. పదోన్నతి పొందుతున్న స్కూల్ అసిస్టెంట్ల జాబితా ప్రకారం కౌన్సిలింగ్ చేపట్టారు. ఉదయం నుండి సాయంత్రం వరకు కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారుల తీరును నిరసిస్తూ సాయంత్రం కౌన్సిలింగ్ కేంద్రం ఎదుట ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి, ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు, పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు కరుణానిధి, మూర్తి ఆప్తా అధ్యక్షుడు ప్రకాష్ రావు, జిల్లా అధ్యక్షుడు సేవాలాల్ నాయక్, ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు గోకారి తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల నిరసన దగ్గరకు వెంటనే డిఇఒ ఎస్ శ్యామ్యూల్ పాల్ వచ్చి ఉపాధ్యాయుల పదోన్నతుల కౌన్సిలింగ్ వెంటనే మ్యానువల్ పద్ధతిలో నిర్వహిస్తామని ప్రకటించడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కౌన్సిలింగ్‌ను సరైన పద్ధతిలో విద్యాశాఖ నిర్వహించడం లేదన్నారు. అంతా హడావుడిగా నిర్వహిస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు,పదోన్నతుల ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను కోరారు. ఈ సందర్భంగా సాయంత్రం ఏడు గంటల నుండి గ్రేడ్ 2 ప్రధాన ఉపాధ్యాయ పదోన్నతుల కౌన్సిలింగ్ ప్రక్రియను రాత్రి వరకు నిర్వహించారు.

నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మహానందరెడ్డి ఇకలేరు...

- అశ్రునయనాలతో అంతిమయాత్ర - సిపిఎం, సిపిఐ ,వైసిపి, టిడిపి నేతల సంతాపం

ప్రజాశక్తి - ఆదోని

మహానంద రెడ్డి (ఫైల్)

కార్మిక, కర్షకులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన సిపిఎం సీనియర్ నాయకులు మహానంద రెడ్డి గురువారం తుదిశ్వాస వదిలారు. సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్, టిడిపినేతలు సంతాపం తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు, అన్ని వర్గాల ప్రజలు దుఃఖ సాగరంలో మునిగి అశ్రునయనాలతో నివాళులర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు మహానంద రెడ్డి మృతి పార్టీకి, కార్మిక ఉద్యమానికి తీరని లోటు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, ఆదోని మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ, సీనియర్ నాయకులు రామాంజనేయులు, మహానందరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహానంద రెడ్డి ఎనిటిసి మిల్లులో కార్మికుల కొనసాగుతూ కార్మికుల కోసం సిఐటియు చేస్తున్న పోరాటాలకు అండగా నిలిచి కీలక నాయకునిగా కొనసాగారని తెలిపారు. సిపిఎం సభ్యత్వం తీసుకున్న నాటి నుంచి నేటి వరకు కార్మిక, కర్షకుల కోసం రాజీలేని పోరాటం చేశారని తెలిపారు. అత్యంత పోరాటపటిమ, సిద్ధాంత నిబద్ధత, ప్రజల పట్ల అచంచలమైన విశ్వాసం కలిగిన కార్మిక నాయకుడు మహానంద రెడ్డి అంటూ కొనియాడారు. కార్మికుల హక్కుల కోసం యాజమాన్యంతో రాజీలేని పోరాటం చేసిన అసలు సిసలైన కార్మిక నాయకునిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. అందరినీ కలుపుకొని స్నేహ స్వభావంతో మెలిగి పార్టీ విస్తరణకు కృషి చేశారన్నారు. అలాంటి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ప్రజా ఉద్యమానికి నిధులు సేకరించడంలోనూ ఎంతో చొరవ చూపారని తెలిపారు. తీవ్రమైన అనారోగ్యంలో కూడా చివరి వరకు ప్రజల కోసం పని చేశారని చెప్పారు. తరలోతే ఈ సమాజం నుంచి దూరమవుతానని తెలిసినా మొక్కవోని దీక్షతో ఇంటికెళ్లి పలకరించిన, పరామర్శించిన వారితో చాలా ఆనందంగా గడిపారని గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి చివరి దాకా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన నివాసం నుంచి ఆర్ట్స్ కళాశాల మీదుగా ఎమ్మిగనూరు రోడ్డులో హరిశ్చంద్ర సంఘం వరకు అంతిమయాత్ర చేపట్టారు. సిపిఐ నాయకులు అజయ్‌బాబు, వీరేష్, టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, యుటిఎఫ్ నాయకులు గాదిలింగప్ప, సర్వయ్య గౌడ్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు ప్రకాష్, రవి, ధర్మరాజు, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ నాయకులు గోపాల్ రెడ్డి, నాగేంద్ర, కృష్ణమూర్తి, సిపిఎం ఆలూరు నాయకులు నారాయణస్వామి, సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్, లింగన్న, సీనియర్ నాయకులు ఈరన్న, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, తిప్పన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, వాల్మీకి వెంకటేష్, నాగరాజు, పెద్దహరివాణం ఆదినారాయణరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి నివాళులర్పించారు.

మతసామరస్యాన్ని కాపాడుకుందాం

- ఉగ్రవాదాన్ని ప్రతిఘటిద్దాం
- కర్నూలులో సిపిఎం సమైక్యతా ర్యాలీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఉగ్రవాదాన్ని తరిమేద్దామని, మతసామరస్యాన్ని కాపాడుకుందామని సిపిఎం ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా పరిషత్ నుండి అంబేద్కర్ సర్కిల్ (పాతబస్టాండ్)వరకు సమైక్యతా యాత్ర నిర్వహించారు.ర్యాలీ అనంతరం అంబేద్కర్ సర్కిల్‌లో సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడుల తరువాత మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టే విధంగా నరేంద్ర మోడీ ఆయన అనుచరగణం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గతంలో ఉగ్రవాద దాడులు జరిగిన సందర్భంగా ఉగ్రవాదాన్ని అణిచివేస్తామని డాంబికాలు పలికిన ప్రధాని ఒక్క టెర్రరిస్టును కూడా సజీవంగా పట్టుకోలేదని అన్నారు. ఉగ్రవాదాన్ని అణిచివేయడానికి అఖిలపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినప్పటికీ బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోస్తుందని, దాని పర్యవసరంగా ఇటీవల కాలంలో ముస్లింలపై 100కు పైగా దాడులు జరిగాయని తెలిపారు. ఉగ్రవాదులు పహల్గాంలోకి ఎలా వచ్చారో బిజెపి ప్రభుత్వం బయట పెట్టకపోగా ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసిన సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరిగా బిజెపి నాయకులు వర్ణించడం అత్యంత దారుణ మైన విషయమని అన్నారు. ఈ దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికలు వస్తే పాకిస్తాన్‌పై ఇలాంటి దాడులకు దిగడం బిజెపికి కొత్తేమీ కాదని తెలిపారు. బిజెపి మూడుసార్లు అధికారంలోకి వచ్చాక ఈ దేశంలో అప్పులు పెరిగాయి తప్ప చిన్న పరిశ్రమ కూడా తీసుకు రాలేదన్నారు. ఏమాత్రం అభివృద్ధికి ఈ దేశం నోచుకోలేదని కేవలం మతపరమైన అజెండాతో బిజెపి కాలం గడుపుతుందని దుయ్యబట్టారు. పహల్గాం దాడుల తర్వాత అఖిలపక్ష పార్టీల మీటింగ్ ఏర్పాటు చేసి పాకిస్తాన్ పై యుద్ధం ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం మూడు రోజుల తర్వాత ట్రంప్ మాటలకు విలువిచ్చి యుద్ధం విరమించడం అఖిలపక్ష పార్టీలను అవమానించడమేనని బిజెపి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసే విధంగా బిజెపి వైఖరి ఉందని, దానికి చక్కటి ఉదాహరణ భారతదేశంలోని అనేక రాష్ట్రాలలో జరిగిన రైతాంగ పోరాటాలను అణిచివేయడం, కార్మిక చట్టాలను రూపుమాపి లేబర్ కోడ్లు తీసుకుని రావడమే నని చెప్పుకోవచ్చని అన్నారు. ఈ దేశంలో ఉండే ఖనిజ సంపదన ఆదానీ, అంబానీలకు దోచి పెట్టేందుకే ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను, నక్సలైట్లను చంపి అడవులను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకేనని విమర్శించారు. ఈ దేశ సౌభ్రాతుత్వాన్ని, సార్వభౌమాధికారాన్ని, దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రజలందరూ ఏకమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు మాట్లాడుతూ ఉగ్రవాదం అంతం ఏమో కానీ పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకోలేకపోతున్నామని అన్నారు. ఈ రాష్ట్రంలో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం జనసేన పార్టీలు బిజెపితో అంట కాగితే వీరికి పుట్టగతులు ఉండవని గుర్తు చేశారు. మతసామరస్యాన్ని కాపాడడంలో చేయిచేయి కలపకపోతే చంద్రబాబు నాయుడుకు పవన్ కళ్యాణ్‌కు ప్రజలుతగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్. రాధాకృష్ణ, కెవి.నారాయణ, ఎండి.ఆనంద్‌బాబు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.విజయ, సి.గురుశేఖర్, ఎన్.అలివేలు, కె.అరుణ, వై.నగేష్, అబ్దుల్లా, రాఘవేంద్ర, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు షరీఫ్, రామకృష్ణ, అబ్దుల్ దేశాయ్, సిహెచ్.సాయి బాబా, కె.సుధాకరప్ప, అర్.నరసిహులు, కె.ప్రభాకర్, నాగస్వాములు జయమ్మ, శ్యామలమ్మ, వేణి, ఎస్ఎ.సుభాన్, కెవిపిఎస్ నగర నాయకులు రమణ, ఎం.భాస్కర్, జి.యేసు, ఉశేన్‌బాషా, శేషాద్రి, వి.శంకర్, జనార్ధన్, సి.శ్రీనివాసులు ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు రాజు, చిట్టెమ్మ, లోకేష్, సుంకన్న, బతుకన్న పాల్గొన్నారు.

కర్నూలులో సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

జగన్నాథ గట్టును పరిశీలించిన కలెక్టర్

- అభివృద్ధి పనులపై ఆరా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టు వద్ద వివిధ సంస్థల ఏర్పాటుకు కేటాయించిన ప్రభుత్వ భూములను, అక్కడ జరుగుతున్న అభివద్ధి పనులను గురువారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జగన్నాథ గట్టు వద్ద టిడ్‌కో గృహాలకు, క్లస్టర్ యూనివర్సిటీకి, త్రిపుల్‌ఐటి డిఎంకు, ఇతర సంస్థల కోసం కేటాయించిన భూములను పరిశీలించారు. మ్యాపుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సంస్థల ఏర్పాటుకు కేటాయించిన భూములకు సంబంధించి సమగ్రమ వివరాలతో నివేదిక అందచేయాలని కలెక్టర్ ఆర్‌డిఒ, తహసీల్దార్లు ను ఆదేశించారు. సిల్వర్ జూబ్లీ క్లస్టర్ యూనివర్సిటీకి సంబంధించి నిర్మాణ పనులకు పెండింగులో ఉన్న పనులను పూర్తి చేసేందుకు నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇఇ కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా, మరొక సారి డిఒ లెటర్ సిద్ధం చేసి పంపాలని సిల్వర్ జూబ్లీ క్లస్టర్ ఇఇని ఆదేశించారు. రూపాల సంగమేశ్వర స్వామి ఆలయం , దర్గాలను కలెక్టర్ దర్శించుకొన్నారు. ఇలాంటి టూరిస్ట్ ప్రదేశాలను ప్రజలకు తెలియచేసే విధంగా పెద్ద ఎత్తున పబ్లిసిటీ చేయాలని కర్నూలు ఆర్‌డిఒను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట కర్నూలు ఆర్‌డిఒ సందీప్, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, కర్నూలు మండల తహశీల్దార్ రమేష్, క్లస్టర్ యూనివర్సిటీ ఇఇ లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కెడిసిసి బ్యాంక్ సిఇఒగా పి రామాంజనేయులు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లా సహకార కేంద్ర బ్యాంకునకు ప్రస్తుతం ఇన్‌చార్జి ముఖ్యకార్యనిర్వహణాధికారిగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం. విజయ కుమార్ తిరిగి తన మాతృ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ బ్యాంకు విజయవాడకు బదిలీ అయ్యారు. నూతన సిఇఒగా పి.రామాంజనేయులు ఇన్‌చార్జి ముఖ్యకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు గురువారం స్వీకరించారు. ఈ సందర్భముగా ఇరువురి అధికారులకు ప్రధాన కార్యాలయంలోని మీటింగ్ హాలులో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భముగా బ్యాంకు అధికారులు, సహకార శాఖ అధికారులు మాట్లాడుతూ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఎం.విజయ కుమార్ డిప్యూటి జనరల్ మేనేజర్ ఒఎస్‌డిగా , ఇంచార్జి ముఖ్యకార్యనిర్వహణాధికారిగా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించి బ్యాంకులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుటకు దోహద పడ్డారన్నారు.బ్యాంకు నూతన ముఖ్యకార్యనిర్వహణాధికారి గా పదవీ బాధ్యతలు చేపట్టిన పి. రామాంజనేయులుకు ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు , బ్యాంకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమములో బ్యాంకు ఉన్నతాధికారులు , ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధి కొరకు జాయింట్ కలెక్టరు, కర్నూలు అండ్ అఫిషియల్ పర్సన్ ఇంచార్జి చైర్పర్సన్ గా బి. నవ్య అందించిన తోడ్పాటును కొనియాడారు. బ్యాంకు ఉద్యోగులందరికి మధ్యంతర భతిని ఉదారముగా మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టరు డాక్టర్ బి. నవ్య, నాబార్డు డిడిఎం సుబ్బారెడ్డి , జిల్లా సహకార అధికారి ఎన్. రామాంజనేయులు , బ్యాంకు ఉన్నతాధికారులు కె.శివలీల, కె.ఉమామహేశ్వర రెడ్డి , బి. సునీల్ కుమార్ , బి.వి. నాగి రెడ్డి , సి. త్రినాథ రెడ్డి , ఇగీత , బ్రాంచి మేనేజర్లు, ఇతర బ్యాంకు సిబ్బంది , సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ నాయకులు రామకృ ఖాజా, రహంతుల్లా పాల్గొన్నారు.

సిఇఒకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం



మహిళా కాంగ్రెస్ అధ్యక్షులుగా హైమావతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని కర్నూలు మండల కాంగ్రెస్ అధ్యక్షురాలుగా బి.హైమావతిని నియమించారు. గురువారం కర్నూలులోని స్థానిక డిసిసి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలానిబాష, అనంత రత్నం ఆమెకు నియామక పత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎండ్లూరి లాజరస్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఎ లలితమ్మ, సి స్వప్న, ఎస్.సలోమి, సి.మాణిక్యమ్మ, రాజేశ్వరి, మల్లికా దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఉల్చాల తాగునీటి సమస్య పరిష్కరించాలి

-స్పందించకుంటే ఆర్‌డబ్ల్యుఎస్ ఆఫీసు ముట్టడిస్తాం

-డివైఎఫ్ఐ నాయకులు హెచ్చరిక

ప్రజాశక్తి- కర్నూలు అగ్రికల్చర్

ఉల్చాల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం చేయకపోతే ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కార్యాలయాన్ని ముట్టడిస్తామని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ హెచ్చరించారు. గురువారం గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ డిఇ కార్యాలయం ముందు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ మాట్లాడుతూ ఉల్చాల గ్రామంలో తాగునీటి సమస్య వలన ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, అనేకసార్లు వినతి పత్రాలు అందజేసినా ప్రజాప్రతినిధులకు తెలియజేసినా సమస్య పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. అనేక సంవత్సరాలు నుండి తాగునీటితో ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేయడం ద్వారా మా సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని, శాసనసభ ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో ఓట్లు వేశారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు పూర్తవుతున్నా ఇప్పటికీ సమస్య పరిష్కారం చేయలేదని, ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. ఉల్చాల గ్రామంలో పది రోజులు, 20 రోజులు ,నెల రోజులకు ఒకసారి మంచినీళ్లు తాగాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారం చేయకపోతే గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య శాఖ సుపరింటెంట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నా దగ్గరికి వచ్చిన డిఇ అమల ,ఎఇ రంగస్వామి సాయంత్రం లోగా చిన్న చిన్న సమస్యలు పరిష్కారం చేసి రేపటిలోగా నీళ్ల అందిస్తామని హామీ ఇచ్చారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ప్రకాష్ గ్రామ కార్యదర్శి హరి కిషన్ రెడ్డి గ్రామ నాయకులు అంజి,రాము, రఘువరన్, విశ్వనాథ్, గోవర్ధన్, హరి ,సాయి తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

నీటి కుంటలను తలపిస్తున్న రోడ్లు

వర్షం పడితే ప్రజల నరకయాతన

ప్రజాశక్తి-సి బెళగల్

వైసిపి హయాంలో పాడయిన రోడ్ల అభివృద్ధి పురోగతి సాధిస్తామని చెప్పిన టిడిపి ప్రభుత్వం హామీని గుప్పించింది. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా హామీలు అమలుకు నోచుకోలేదు. ఫలితంగా ప్రజలకు, ప్రయాణికులకు కోడుమూరు నియోజకవర్గంలోని మారుమూల మండలమైన సి బెళగల్‌లో పాలకులనుంచి కనీస స్పందన కరవైనట్లు తెలుస్తోంది. గత్యంతరం లేక అవే రోడ్లపైనే గమ్యం చేరక, అవసరాలు తీర్చుకోక తప్పడం లేదు. అందుకు నిదర్శనంగా సి.బెళగల్‌లో కస్తూరిబా మొదలు కొని మోడల్ స్కూల్ వరకు మూడు కిలోమీటర్లు పైనే రోడ్డు దుస్థితి తీవ్ర అధ్వాన్నంగా మారింది. పెద్ద గుంతలు ఏర్పడి 100 అడుగులకు ఓ గుంతగా దర్శనమిస్తూ వర్షాకాలంలో నడి రోడ్డులో నీటి కుంటలను తలపిస్తున్నాయి. ఇదే సి బెళగల్ కేంద్రానికి మారు మూల గ్రామాల నుండి ప్రజలు, ప్రయాణికులు అధికంగా చేరుకొని అటు కర్నూలు ఇటు ఎమ్మిగనూరు పట్టణాలకు దారి గుండానే వెళ్లాల్సి ఉంది. పోలకల్ నుండి ఎమ్మిగనూరు వరకు సుమారు 30 కిలోమీటర్లు ఉంది. సింగిల్ రోడ్డు కావడంతో పెరిగిన వాహనాల రద్దీకి రోడ్డు ప్రయాణానికి అనుకూలంగా లేదు. తప్పని పరిస్థితుల్లో గమ్యం చేరాలన్న అవసరాలు తీర్చుకోవాలన్నా అటు వాహనాలు ఇటు ఇటువి అటుగా ఏది ఇలా ఎదురు పడుతుందో ఎలా చక్కర్లు కొడుతున్నాయో రాకపోకలు గజిబిజిగా మారాయి. పలు సందర్భాల్లో అత్యవసర ఆరోగ్య సమస్య ఉన్నప్పుడు పెద్దాసుపత్రికి గాని కనీసం మండల కేంద్రంలో 24 గంటల ఆసుపత్రికి, వెళ్లడం అష్టకష్టాలు పడితేగాని చేరుకొని దుస్థితి నెలకొంది. వర్షా కాలంలో వర్షం పడిందా చిన్న పాటి వర్షాలకే గుంతలు నిండుకొని పోవడంతో ప్రయాణాలు తీవ్ర నరకయాతనగా మారింది. పలు సందర్భాల్లో అక్కడక్కడా మట్టితో గుంతలు పూడ్చినను ఉపయోగం లేక సమస్య యధాస్థితిలోకి వెళ్ళక తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణకు, గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఈరోడ్డుపై ఎలా వెళ్లాలి

పాలకుల తీరు బాగలేదు : జె మోహన్
సిపిఎం జిల్లా కమిటి సభ్యులు



సిబెళగల్‌లో ప్రధాన రోడ్డు గుంతలు, కుంటలను తలపిస్తుంది. అదే దారుల్లోనే అధికారులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు వెళ్తూ చూస్తూ కనీస ప్రాథమిక స్పందన చూపక పోవడం నిస్సిగ్గుగా ఉంది. సొంత ఆదాయ మార్గాల కోసం కాకుండా మండలంలో శాశ్వత అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలి.

నా చిన్నప్పటి నుండి ఇదే దుస్థితి
ప్రకాష్ ఆచారి బురాన్ దొడ్డి



నాకు 40 ఏళ్ళు..నా ఏడేళ్లప్పటి నుండీ ఇదే రోడ్డు ఇదే దుస్థితి. ఏమాత్రం మా రడం లేదు. ఇదే మండలం చుట్టూ ఉన్న ప్రక్క మండలాల రోడ్లు వాటి పరిధి వరకు క్షేత్రస్థాయిలో పాలకులు అభివృద్ధిని మరిచారు. సి బెళగల్ మండల కేంద్రమే కాకుండా పల్లె దారుల బిటి రోడ్లు కూడా ఆనవాళ్ల కానరావడం లేదు.

గుంతల రోడ్లలో పడుతూ లేస్తున్నారు
అడివప్ప సి బెళగల్ వాసి



ఏళ్ల కొద్దీ రోడ్డు అభివృద్ధి పట్టని కారణంగా మా దుకాణం ముందు పెద్ద గుంతలు లోతుగా ఏర్పడ్డాయి. అటుగా వెళ్లే ఆటోలు, బైక్ లు నీటి కుంటలను తలపిస్తున్న గుంతలలో వెళ్తూ ప్రమాదవషాత్తు కింద పడుతూ లేస్తున్నాయి. గాయాలైన సందర్భాలు అధికం..

అడ్వయిజరీ కమిటీలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ శాంతికళ

స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటి సమావేశం డిఎంహెచ్‌ఒ డాక్టర్ పి.శాంతికళ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆన్‌లైన్‌లో స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ , రెన్యువల్ కొరకు వచ్చిన అప్లికేషన్స్ కమిటి ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. వీటిని జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటి సభ్యులు పరిశీలించారు. తదుపరి కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా స్థాయి మల్టీ మెంబెర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటి ఆమోదానికి పంపుతామని తెలిపారు. డాక్టర్ పి.శాంతి కళ మాట్లాడుతూ ఆడపిల్లల ప్రాముఖ్యత , సరియైన వివాహ వయస్సుపై అవగాహన కొరకు ఎన్‌జివోస్ సహాయం తో ఆడ పిల్లల నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాలలో , డిగ్రీ ,ఇంటర్ , నర్సింగ్ కళా శాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్కానింగ్ సెంటర్స్‌పై సాదారణ తనిఖీలు ,ఆకస్మిక తనిఖీలను నిర్వహించాలని తీర్మా నించారు. సిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నాగప్రసాద్ బాబు, పీడి యాట్రిక్స్, గైనకాలజి ప్రొఫెసర్ ,హెచ్‌ఒడి డాక్టర్ విజయానందబాబు, శ్రీలక్ష్మి, రేడియాలజి ప్రొఫెసర్ డాక్టర్ రాధారాణి, సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖాదర్ భాష , డెమో శ్రీనివాసులు శెట్టి , ఎన్‌జిఒ ప్రతినిధులు కొమ్ముపాలెం శ్రీనివాసులు , అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ దివాకర్ రావు , డిప్యూటీ డెమో చంద్రశేకరరెడ్డి , హెచ్ఇ పద్మావతి , ప్రోగ్రాం కన్సల్టెంట్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరు మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను, శ్రీరామ సీడ్స్, ఉరుకుంద ట్రేడర్స్, శ్రీ రామలింగేశ్వర పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ దుకాణాలలో అమ్ముతున్న విత్తనాలను పరిశీలించారు. వారికి ఇచ్చినటువంటి సలహాలు ఇచ్చారు. రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, రైతులు కూడా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. ఎమ్మార్పీ ధరల కన్నా ఎక్కువ అమ్మితే చర్యలు తప్పవన్నారు. రైతుల అడిగిన విత్తనం మాత్రమే ఇవ్వాలని, అదనంగా వేరే కంపెనీల విత్తనాన్ని అంటగట్టరాదన్నారు. మండలంలో పత్తి ,కంది, సద్దలు ,ఆముదాలు, కావాల్సిన మోతాదులో అన్ని దుకాణాల్లో ఉన్నందున రైతులు ఇబ్బంది పడవద్దన్నారు. మండలంలో ఎక్కడైనా లూజు పత్తి విత్తనాలు అమ్ముతుంటే వాటిని రైతులు తీసుకోవద్దన్నారు.

ఫైళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

యోగాతో ఒత్తిడి దూరం

- యోగా ప్రత్యేకాధికారి రాజు, డిప్యూటీ ఎంపిడిఒ బాలన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

యోగా చేయడం వల్ల శారీరిక, మానసిక, ప్రశాంతత లభించి, అనారోగ్య సమస్యలు దూరమవుతాయని, ఒత్తిడి కూడా దూరమవుతుందని యోగా శిక్షణ ప్రత్యేకాధికారి రాజు, డిప్యూటీ ఎంపిడిఒ బాలన్న, ఎంఇఒ సావిత్రమ్మ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా గురువారం మండల కార్యాలయం నుంచి స్థానిక బస్టాండ్ సర్కిల్ వరకు యోగా చేయడంతో కలిగే లాభాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆరోగ్యం బాగుండాలంటే నిత్యం యోగా చేసే అలవాటు చేసుకోవాలన్నారు. యోగా చేయడంతో ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో బిపి, షుగర్ ఎక్కువ శాతం వస్తున్నాయని, వీటన్నింటినీ జయించాలంటే యోగా శిక్షణ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఎఒ శ్రీనివాసులు, సాహితీ, పంచాయతీ కార్యదర్శులు నరేంద్ర, సిసింద్రీ, జయరాం నాయక్, సుధీర్, ప్రమీల, నరసింహులు పాల్గొన్నారు.

సమైక్యత యాత్రను జయప్రదం చేయండి

- వామపక్ష నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న గోవిందు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దేశ సమగ్రత పరిరక్షణకు శుక్రవారం జరిగే సమైక్యత యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పి.గోవిందు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.సత్తన్న కోరారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో వామపక్షాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదం దేశ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని తెలిపారు. దేశ సమగ్రత పరిరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో సమైక్యత యాత్రలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ యాత్రలను ప్రజలు, లౌకికవాదులు, ప్రజా సంఘాలు బలపరచాలని కోరారు. ఎమ్మిగనూరులో శుక్రవారం సమైక్యత యాత్రను జయప్రదం చేయాలని కోరారు. వామపక్ష నాయకులు బి.రాముడు, ఎం.అబ్దుల్లా, ఎస్.బాలరాజు, యు.రమేష్ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద లోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ చేపట్టినట్లు ఎఒ ఆనంద్ లోకదాల్ తెలిపారు. గురువారం శ్రీఆంజ నేయం, ఉష, ఫర్టిలైజర్, మన గ్రోమోర్, కిసాన్ మాల్, జువారి ఫర్టిలైజర్ దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్మకాలు జరపాలని, రైతులు కొన్న విత్తనాలు, ఎరువులకు సంబంధించిన బిల్లు లు తప్పనిసరిగా ఇవ్వాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ వీరుపాక్షి, ఎంపీఈ ఓ నరసింహ పాల్గొన్నారు.

ఎరువు దుకాణాల్లో తనిఖీ చేపడుతున్న ఆనంద్

దళిత కుటుంబంపై ఉన్మాది దాడి

- అరెస్టుకు కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

దళిత కుటుంబం పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. కల్లూరు అర్బన్ 29వ వార్డు 73వ సచివాలయం పరిధిలో సూర్యనారాయణ దేవాలయం వెనక ఉన్న బాలాజీనగర్‌లో బుధవారం సాయంత్రం ఇంటి నెంబర్ 81/337 లోకివెళ్లి బాలికల పైన, మహిళ పైన విచక్షణ రహితంగా అసభ్యంగా ప్రవర్తించిన తాగుబోతు పెద్దవీరన్న ఏ పెద్ద వీరారెడ్డి ఉద్దేశపూర్వకంగానే వీరంగం చేశాడన్నారు. వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, నగర కార్యదర్శి ఎం.భాస్కర్ డిమాండ్ చేశారు. తాగి ఇంటి ముందుకొచ్చి బట్టలిప్పుకొని అసభ్యంగా మాట్లాడడంతో పాటు ఇంట్లోకి వెళ్లి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఈరన్నపై ఫోక్సో చట్టాన్ని నమోదు చేయాలని వారు కోరారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల భద్రత కోసం పోలీసు విభాగం వారు 'శక్తి' పేరుతో 79934 85111 అనే వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి వచ్చిందని, ఆ నెంబర్ ద్వారా వెంటనే స్పందించిన శక్తి టీమ్‌కు ధన్యవాదాలు తెలిపారు. దాడికి పాల్పడిన ఉన్మాదిని వెంటనే అరెస్టు చేయాలని దళిత కుటుంబానికి రక్షణ కల్పించాలని వారు కోరారు.

అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఈరన్న

ప్రశాంతంగా సిల్వర్ సెట్ పరీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పరీక్షలను పర్యవేక్షిస్తున్న సిబ్బంది

క్లస్టర్ యూనివర్సిటీ కర్నూలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రవేశాలకు నిర్వహించిన సిల్వర్ సెట్ పరీక్ష గురువారం ప్రశాంతంగా పరీక్ష నిర్వహించారు. మొత్తం 7 పరీక్ష కేంద్రాలలో 90శాతం విద్యార్థులు పరీక్షలు రాశారు. కర్నూలు లోని జి పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో, ఎమ్మిగనూరు లోని సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 94 శాతం విద్యార్థులు హాజరయ్యారు. కర్నూలు, ఎమ్మిగనూరులలోని పరీక్ష కేంద్రాలను క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, డీన్ ఇన్చార్జ్ అకాడమిక్ డాక్టర్ మొహమ్మద్ వాయిజ్ సందర్శించి పరీక్ష నిర్వహణ సమర్థవంతంగా జరిగేటట్లు తగిన చర్యలు తీసుకున్నారు.

ప్రమాదవశాత్తు రైతు మృతి

ప్రజాశక్తి - కౌతాళం

వ్యవసాయ పనుల్లో భాగంగా పొలంలో ప్రమాదవశాత్తు రైతు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... కోసిగి మండలం కోల్మాన్ పేటకు చెందిన తిప్పయ్య కుమారుడు మధుర ఆంజనేయ అలియాస్ ముకరయ్య (40) ట్రాక్టర్ రోటవేటర్ కింద ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. కౌతాళం పోలీసు స్టేషన్ పరిధిలోని తిప్పలదొడ్డి, కరణి మధ్య పెద్ద ఈరన్న పొలంలో ట్రాక్టర్ రోటవేటర్‌తో దున్నుతున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

మృతి చెందిన రైతు ముకరయ్య

ఎండియు వాహనాలను కొనసాగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి

సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

ప్రజా పంపిణీ వ్యవస్థను ఎండియు వాహనాల ద్వారానే కొనసాగించాలని సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నిత్యావసర సరుకులను ఎండియు వాహనాల ద్వారా నేరుగా ప్రజలకు సరఫరా చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ వ్యవస్థను రద్దు చేసి వేలాది మంది ఆపరేటర్లను, అసిస్టెంట్లను తొలగించడం సమజసం కాదన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల దాదాపు 20 వేల మంది కుటుంబాలు రోడ్డున పడతాయని తెలిపారు. ఎండియు ఆపరేటర్లను తొలగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎండియు ఆపరేటర్లు, అసిస్టెంట్లతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

గుండెపోటుతో టిడిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి -హోళగుంద

చంద్రశేఖర్ (ఫైల్)

వందవాగిలి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కురువ చంద్రశేఖర్ (53) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం చంద్రశేఖర్ మృతదేహానికి టిడిపి నాయకులు పూలమాల వేసి నివాళు లర్పించారు. వారు మాట్లాడుతూ... టిడిపి ఏర్పడినప్పటి నుంచి పార్టీ అభివృద్ధికి పని చేశారని తెలిపారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా పార్టీని అంటిపెట్టుకుని కార్యక్రమాల్లో ముందుండేవారని చెప్పారు. చంద్రశేఖర్‌కు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు. ఆయన మృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటని చెప్పారు. టిడిపి నాయకులు కురువ శేషన్న, నాగప్ప, రాజగోపాల్ రెడ్డి, కర్లింగ పాల్గొన్నారు.

'గురుకులాల'కు 34 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలోని వివేకానంద యుపి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుంచి 34 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ హనుమంతు, ప్రధానోపాధ్యాయులు కోటేష్ తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. 4 నుంచి 5వ తరగతి ప్రవేశాలకు గాను ఎపి రెసిడెన్షియల్ పాఠశాలలకు ఐదుగురు, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలకు 17 మంది, జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలకు 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

- రవాణా కమిటీ సభ్యులు రవి యాదవ్

ప్రజాశక్తి - చిప్పగిరి

ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రవాణా కమిటీ సభ్యులు మేకల రవి యాదవ్ తెలిపారు. కడపలో జరిగిన మహానాడులో టిడిపి అతిరథ మహారథులకు చేదోడు.. వాదోడుగా ఉంటూ వారికి తగిన సలహాలు ఇస్తూ సభా ప్రాంగణానికి రవాణా వాలంటీరుగా రవి యాదవ్ విధులు నిర్వర్తించారు. గురవారం మహానాడు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గరకు పిలుచుకొని సూపర్‌గా చేస్తున్నారని, మీకు పార్టీ తగిన గౌరవం కల్పిస్తుందని చెప్పినట్లు రవి యాదవ్ తెలిపారు. జిల్లా నుంచి రవాణా వాలంటీర్లుగా ఇద్దరికి మాత్రమే అవకాశం వచ్చిందన్నారు. పార్టీ అధిష్టానం తనను గుర్తించి మహానాడులో సేవలు అందించేందుకు అవకాశం కల్పించడం తన అదృష్టమని తెలిపారు. పార్టీకి ఎన్నో ఏళ్ల నుంచి సేవలు చేసిన అతిరథ మహారథులను కలవడం మంచి అనుభూతి అని చెప్పారు.

సిఎం చంద్రబాబుతో రవి యాదవ్

వ్యవసాయ పథకాలను వినియోగించుకోవాలి

- జెడిఎ వరలక్ష్మి

ప్రజాశక్తి - గోనెగండ్ల

నూతన సాంకేతిక వ్యవసాయ పథకాలను వినియోగించుకోవాలని జెడిఎ వరలక్ష్మి సూచించారు. గురువారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నూతన సాంకేతికత, వ్యవసాయ పథకాలపై గోనెగండ్లలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడిఎ వరలక్ష్మి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన నూతన సాంకేతిక వ్యవసాయ పథకాలను రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. రైతులందరూ సాయిల్ హెల్త్ కార్డులు, సిసిఆర్‌సి కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డ్రోన్ 80 శాతం సబ్సిడీ కింద మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎడిఎ గిరీష్ మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్‌లో పత్తి, కంది, కొర్ర తదితర పంటల్లో సేద్యపు ఖర్చులను రైతులు ఏ విధంగా తగ్గించుకోవచ్చో వివరించారు. బనవాసి కెవికె కోఆర్డినేటర్ రాఘవేంద్ర మాట్లాడుతూ... వివిధ పంటలు విత్తుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు, పురుగు, తెగుళ్ల నివారణ చర్యలు, అధిక, తక్కువ వర్షపాతం వచ్చిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఆత్మ డిపిడి శ్రీలత, డిఆర్‌సి ఎఒ శశిధర్, ఇఫ్కో సేల్స్ ఆఫీసర్ మహేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వరలక్ష్మి

బస్టాండ్ పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

బస్టాండ్‌లో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. గురువారం పట్టణంలోని ఎపిఎస్‌ఆర్‌టిసి బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాల్లో పరిశుభ్రత, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు, పార్కింగ్, హోటళ్ల పరిస్థితులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బస్టాండ్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులకు తాగునీటి వసతిని మెరుగుపరచాలని తెలిపారు. టాయిలెట్లను శుభ్రంగా ఉంచాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు. బస్టాండ్‌లో ప్రయివేట్ వాహనాలను పార్కింగ్ చేయడం గమనించిన సబ్ కలెక్టర్, పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రయాణికులతో మాట్లాడుతూ... బస్సుల సమయపాలన, సదుపాయాల గురించి ఆరా తీశారు. ప్రయాణికులు సంతృప్తి వ్యక్తం చేసినా, టాయిలెట్ల పరిశుభ్రత విషయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశుభ్రంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌కు సూచించారు. బస్టాండ్ ఎంట్రెన్స్, ఎగ్జిట్ వద్ద రోడ్డు పరిస్థితిని పరిశీలించి, తగిన రోడ్డు వసతులు కల్పించాలని ఆదేశించారు.

బస్టాండ్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నివాళులర్పిస్తున్న నాయకులు

జోసెఫ్ మృతి తీరని లోటు

- జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు జానయ్య మాదిగ

ప్రజాశక్తి - మంత్రాలయం

జైభీమ్ ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు జోసెఫ్ మృతి తీరని లోటని సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ తెలిపారు. గురువారం గ్రామానికి చేరుకొని జోసెఫ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. మండలంలోని సౌలహల్లి గ్రామానికి చెందిన జోసెఫ్ బుధవారం గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు. సంఘంలో ఉత్సాహంగా పని చేస్తూ సేవలు అందించేవా రని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ, జిల్లా కార్యదర్శి మాదిగ రత్నం, మండల అధ్యక్షులు గాడిమోడీ నరసింహులు, చెట్నిహల్లి గ్రామ అధ్యక్షులు నరసింహులు, సౌలహల్లి గ్రామ నాయకులు ఇశ్రాయేలు, ప్రభాకర్, హుస్సేన్, జోజప్ప, దేవదాసు, వి.తిమ్మాపురం గ్రామ అధ్యక్షులు మామిడి నాగేష్ ఉన్నారు.

అక్రిడిటేషన్ గడువు 3 నెలల పొడిగింపు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పాటు ఆగస్టు 31 వరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల గురువారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం మే31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1, 2025 నుండి ఆగస్టు 31, 2025 వరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని ఆ ప్రకటనలో సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు శ్రీ హిమాన్షు శుక్ల తెలిపారు.

తీర్మానం నెంబర్ 485ను రద్దు చేయాలి

- కుల సంఘాల ప్రతినిధులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

హిందూ శ్మశాన వాటిక భూమి మీదుగా 30 అడుగుల రోడ్డు కోసం మున్సిపల్ కౌన్సిల్‌లో ఆమోదించిన 485వ తీర్మానాన్ని రద్దు చేయాలని కులసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని తాలూకా యాదవ సంఘం కార్యాలయంలో పట్టణం నుంచి కర్నూలుకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న హిందూ రుద్ర శ్మశాన వాటిక భూమితో సంబంధం కలిగిన 22 కుల సంఘాల ప్రతినిధుల అత్యవసర సమావేశం నిర్వహించారు. యాదవ సంఘం తాలూకా అధ్యక్షులు అడ్వకేట్ నారాయణ అధ్యక్షత వహించారు. కుల సంఘాల ప్రతినిధులు బిఎల్.నారాయణ, గణేష్, పాండురంగ స్వామి, మాధవస్వామి, మెకానిక్ కురుబ బీరప్ప, పూజారి లక్ష్మన్న, వీరేష్, దస్తగిరి, శేఖర్, కన్నయ్య, వడ్డే మల్లేష్, నాగరాజ యాదవ్ మాట్లాడారు. హిందూ శ్మశాన వాటిక భూమి సర్వే నెంబర్ 183బి మీదుగా 30 అడుగుల రోడ్డును 17వ వార్డు ప్రజల స్థలాలకు సౌకర్యంగా ఏర్పాటు చేసేందుకు మార్చి 31, 2023న మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మాణం చేసి ఆమోదించారని తెలిపారు. పెరుగుతున్న తమ కులాల జనాభాకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న శ్మశాన వాటిక భూమి సరిపోవడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో శ్మశాన వాటిక భూమి మీదుగా మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ప్రతిపాదనలో ఉంచి ఆమోదించిన రోడ్డు పరిసరాల్లో ఎలాంటి నివాసాలు, ప్రజలు లేరని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశామంటూ, 17వ వార్డు ప్రజల రాకపోకల సౌకర్యార్థమంటూ, పుర ప్రజలను మభ్యపెడుతూ, కొంతమంది భూ కబ్జాదారుల కోసం మున్సిపల్ కౌన్సిల్‌లో ఆమోదించిన తప్పుడు తీర్మానం నెంబర్ 485ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మీడియా ప్రతినిధి సిరాలదొడ్డి రవి యాదవ్, కుమ్మరి వెంకటేష్, పండుకుర రంగన్న, జగ్గాపురం ఉరుకుందు, గిడ్డయ్య, నరసింహులు, వీరేష్, తిప్పన్న, భీమన్న, నాగరాజు, లక్ష్మీనారాయణ, రాజేష్, సుంకన్న పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

వివాహ వేడుకల్లో ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాలపల్లి గ్రామంలో జరిగిన వివాహ వేడుకలకు వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి హాజరయ్యారు. గురువారం మాలపల్లి గ్రామానికి చెందిన వడ్డే గోపాల్ కుమారుడు వడ్డే విరుపాక్షి, ఇందుల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లి పెద్దల ఆహ్వానం మేరకు పెళ్లి మండపం చేరుకున్న ఆయనకు, న్యాయవాది గురురాజ రావుకు ఘనంగా స్వాగతం పలికి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు.

వివాహ వేడుకలకు హాజరయిన ప్రదీప్ రెడ్డి

విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలి

- కాలనీ వాసుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

పట్టణ శివారులోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న శ్రీసాయి నగర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ వాటికి విద్యుత్ తీగలు ఏర్పాటు చేయలేదని, వెంటనే కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కాలనీ వాసులు కోరారు. గురువారం ఆదోని విద్యుత్ భవనం ముందు నిరసన చేపట్టారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్ బాబు, పట్టణ కార్యదర్శి సుదర్శన్, జిల్లా సమితి సభ్యులు వీరేష్, మండల కార్యదర్శి కల్లుబావిరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి బసాపురం గోపాల్, ఎఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి అంజిత్ గౌడ్ మద్దతు తెలిపారు. సమస్య తీవ్రతను గుర్తించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని విద్యుత్ అధికారులను కోరారు. కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, లేకపోతే సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. లక్ష్మీనారాయణ, విజయ్, బేల్దార్ రాముడు, రమేష్ కుమార్, నరసింహులు, కిరణ్, జయమ్మ, మహాలక్ష్మి ఉన్నారు.

రోడ్డుపై నిలిచిన మురుగునీటిని చూపుతున్న కాలనీ వాసులు

పడకేసిన పారిశుధ్యం

- రోడ్డుపై పేరుకుపోయిన మురుగు

- పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని ముద్దటమాగి గ్రామంలో పారిశుధ్యం పడకేసిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై మురుగు పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి చెంది, రోగాల బారిన పడుతున్నట్లు వాపోయారు. భీరప్ప తాత దేవాలయం వెనుక కాలనీలో రోడ్డుపై మురుగు చేరి దుర్వాసన వస్తోందని, గ్రామంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని తెలిపారు. మురుగు కాలువలను శుభ్రం చేయాలని పంచాయతీ అధికారిని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. ఇఒఆర్‌డి చక్రవర్తిని వివరణ కోరగా... త్వరలోనే పారిశుధ్య పనులు చేపడతామని తెలిపారు.

సిఎం బాబును కలిసిన మీనాక్షి నాయుడు

బాబును కలిసిన మీనాక్షి

ప్రజాశక్తి - ఆదోని

కడపలో మూడు రోజుల పాటు జరిగిన మహానాడు సమావేశాలు గురువారం ముగిశాయి. మంగళవారం నుంచి సమావేశాలు జరిగాయని, చివరి రోజు సిఎం చంద్రబాబును కలిశామని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జ్ మీనాక్షి నాయుడు గురువారం తెలిపారు. కేటాయించిన సమయంలో నియోజకవర్గ పరిధిలోని సమస్యలను వివరించగా సానుకూలంగా స్పందించారన్నారు. నమ్మకంగా పార్టీకి సేవలు అందించారని, త్వరలో గుర్తింపు దక్కుతుందని సిఎం తనకు భరోసా ఇచ్చారని తెలిపారు.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. గురువారం స్వామి వారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి, మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళ తాళాలు, మంగళ వాయిధ్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు.

ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులు

మహానాడుకు తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి - హాలహర్వి

కడపలో జరుగుతున్న మహానాడుకు హాలహర్వి మండలం గూళ్యం నుంచి టిడిపి నాయకులు భారీగా తరలి వెళ్లారు. గురువారం టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జ్ వీరభద్ర గౌడ్ ఆదేశాల మేరకు డిసిసి డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ మల్లప్ప అధ్యక్షతన బయల్దేరారు. మండలంలోని సిరుగాపురం, చింతకుంట, బాపురం, అమృతాపురం, సిద్ధాపురం గ్రామాల కార్యకర్తలు బయల్దేరి మహానాడుకు బయల్దేరి వెళ్లారు.

బయల్దేరుతున్న నాయకులు

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.ఎ.నెం. 327/2024

ఇన్ ఐ.పి.నెం.4/2023

శ్రీమతి టి.చంద్రగౌరి. ...అర్జీదారు

-వర్సెస్-

ఎ.వినయ్‌కుమార్ మరియు వగైరా. ...రెస్పాండెంట్లు

ఒకటి,రెండు రెస్పాండెంట్లకు ఆర్డర్ 9రూల్ 9 ప్రకారం నోటీసులు

1. ఎ.వినయ్‌కుమార్ తండ్రి ఎ.రామస్వామి,నాగన్నగౌడు ఇంటి.నెం.56-10-ఇ, కొండయ్యగేటు, కర్నూలు సిటి.

2. ఎ.విజయ్‌కుమార్ తండ్రి ఎ.రామస్వామి, నాగన్నగౌడు ఇంటి.నెం.56-10-ఇ, కొండయ్యగేటు, కర్నూలు సిటి.

పై నెంబరు ఐ.పిలో అర్జీదారు తాను దాఖాలు చేసిన ఐ.పి కేసు డిస్మిస్ ఫర్ డిఫాల్ట్ క్రింద 2-9-2024 వ తేదిన పై కోర్టు వారు తీసివేసినారు. అర్జీదారు డిస్మిస్ ఫర్ డిఫాల్ట్ అయిన కేసును మరళ రెస్టోర్ చేయమని అర్జీదాఖలు చేసినారు. సదరు విషయమై 1,2 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 04-7-2025వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదురు అర్జీని మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడ మైనది.

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 04-7-2025

యస్.మురళీక్రిష్ణ రెడ్డి,
అర్జీదారు పరం అడ్వకేటు, కర్నూలు.